# మరిపెడలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏల శిక్షణ శిబిరం



**తొలి అక్షరం/మరిపెడ, జూన్ 10:** మరిపెడలోని భార్గవ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణ శిబిరం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఆకర్ల నర్సిరెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, టీపీసీసీ కోఆర్డినేటర్ ఎండి అవిజ్ ఖాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అసలైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ, డమ్మీ ఓట్లను నమోదు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భారత పౌరులను ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.అలాగే, దేశ సంపదను కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా మార్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా, అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఓటరును గుర్తించి, వారి ఓటు హక్కును కాపాడేందుకు బీఎల్ఏలు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 99 ప్రణాళికలో భాగంగా వెల్‌జర్లలో గ్రామసభ

- పరిశుభ్రత, తాగునీరు, జల సంరక్షణపై అవగాహన
- గ్రామ కార్యదర్శి యాదయ్యకు ఘన వీడ్కోలు.. బాల మల్లేష్‌కు స్వాగతం





**తొలి అక్షరం /షరూక్ నగర్, జూన్ 10:** గ్రామాభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న 99 ప్రణాళికలో భాగంగా వెల్‌జర్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్, గ్రామ కార్యదర్శి బాల మల్లేష్ ఆధ్వర్యంలోగ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, మొక్కల పెంపకం, వన మహోత్సవం, వరదల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.అదేవిధంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణ సులభమవుతుందని అవగాహన కల్పించారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. జల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, వన మహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న యాదయ్యకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు.గ్రామ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. అలాగే నూతనంగా గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బాల మల్లేష్‌కు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడితే రూ.వెయ్యి ఫైన్

- మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు
- ఒక్కరోజులోనే 962 కేసులు..రూ. 9.62 లక్షల జరిమానా వసూలు




Malkajgiri Commissionerate
Special Drive Cases on Cell phone Driving Dt: 10.06.2026.

| S.No | Police station | (Contact) Cases | (Contact) Amount | (Non-Contact) Cases | (Non-Contact) Amount | Grand Total: Total Cases | Grand Total: Total Amount |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Malkajgiri Tr PS | 66 | 66000 | 3 | 3000 | 69 | 69000 |
| 2 | Gopalpuram Tr PS | 83 | 83000 | 52 | 52000 | 135 | 135000 |
| 3 | Jawaharnagar Tr PS | 57 | 57000 | 5 | 5000 | 62 | 62000 |
| 4 | Trimulgherry Tr PS | 96 | 96000 | 7 | 7000 | 103 | 103000 |
| 5 | Alwal Tr PS | 75 | 75000 | 26 | 26000 | 101 | 101000 |
| 6 | Begumpet Tr PS | 87 | 87000 | 33 | 33000 | 120 | 120000 |
| Zone- I | | 464 | 464000 | 126 | 126000 | 590 | 590000 |
| 1 | LB Nagar Tr PS | 53 | 53000 | 52 | 52000 | 105 | 105000 |
| 2 | Vanasthalipuram Tr PS | 60 | 60000 | 87 | 87000 | 147 | 147000 |
| 3 | Uppal Tr PS | 45 | 45000 | 11 | 11000 | 56 | 56000 |
| 4 | Kushaiguda Tr PS | 30 | 30000 | 6 | 6000 | 36 | 36000 |
| 5 | Ghatkesar Tr PS | 22 | 22000 | 6 | 6000 | 28 | 28000 |
| Zone- II | | 210 | 210000 | 162 | 162000 | 372 | 372000 |
| Total | | 674 | 674000 | 288 | 288000 | 962 | 962000 |

Section:
Cell Phone Driving (S 184)

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూన్10:** వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ ఉపయోగించే వారిపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచే చర్యల్లో భాగంగా బుధవారం కమిషనరేట్ వ్యాప్తంగా అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్) చేపట్టారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి,ఐపిఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్-1, డీసీపీ ట్రాఫిక్-11 పర్యవేక్షణలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఈ తనిఖీల్లో చురుగ్గా పాల్గొన్నారు.

**రూ.9.62 లక్షల జరిమానా:**

ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఒక్కరోజులోనే 962 కేసులు నమోదు చేశారు.
నిందితుల నుంచి రూ.9లక్షల 62 వేల జరిమానాగా వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**ప్రధాన కూడళ్లలోనే నిఘా:**

నగరంలోని ప్రధాన కూడళ్లు,కారిడార్లు, సిగ్నల్ పాయింట్లు, విపరీతమైన రద్దీ ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను రంగంలోకి దించారు. కేవలం ఫోన్ మాట్లాడే వారినే కాకుండా, డ్రైవింగ్ చేస్తూ మెసేజ్‌లు పంపేవారు, ఇంటర్నెట్ బ్రౌజ్ చేసేవారు, వీడియో రికార్డింగ్‌లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆపరేట్ చేసే వాహనదారులను ప్రత్యేకంగా గుర్తించి జరిమానాలు విధించారు.

**ప్రమాదాలకు ప్రధాన కారణం అదే:**

సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల వాహనదారుల ఏకాగ్రత దెబ్బతింటుందని, సకాలంలో నిర్ణయాలు తీసుకోలేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి సాధారణ బాటసారులు, ఇతర ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఒక కాల్ కాసేపు ఆగొచ్చు..కానీ ఒక ప్రమాదం జీవితాన్ని శాశ్వతంగా మార్చేస్తుంది.-మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్**

మొబైల్ మాట్లాడటం అత్యవసరమైతే వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో పక్కకు ఆపి మాట్లాడాలని డీసీపీ (ట్రాఫిక్) సూచించారు.రానున్న రోజుల్లోనూ ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, పదే పదే తప్పులు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హెల్మెట్ లేకపోతే ఊరిలోకి నో ఎంట్రీ







- ఒకే రోజు 119 గ్రామ పంచాయతీలు, 9 వార్డుల్లో ఏకగ్రీవ తీర్మానం
- గంజాయి సమాచారమిస్తే రూ.5వేల నగదు బహుమతి: జిల్లా ఎస్పీ డా.శబరీష్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్10:** రహదారి భద్రత,శాంతిభద్రతల పరిరక్షణలో మహబూబాబాద్ జిల్లా సరికొత్త చరిత్ర సృష్టించింది. మన ఊరు మన బాధ్యత లో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో రికార్డు స్థాయిలో 119 గ్రామ పంచాయతీలు,9 మున్సిపల్ వార్డుల పాలకవర్గాలు, ప్రజలు కలిసి నో హెల్మెట్ నో ఎంట్రీ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. హెల్మెట్ లేనిదే తమ గ్రామాల్లోకి రానిచ్చేది లేదని ప్రజలు తేల్చి చెప్పారు. బుధవారం గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభ,రహదారి భద్రత ప్రత్యేక అవగాహన సదస్సుకు జిల్లా ఎస్పీ డా. శబరీష్. పి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అత్యధికులు హెల్మెట్ ధరించని వారేనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణ రక్షణ కోసం ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామాలే స్వచ్ఛందంగా ముందడుగు వేసి సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియమాల పాటింపుతో పాటు గంజాయి అనే మహమ్మారిని ఊరిలోకి రానివ్వబోమని తీర్మానించడం అభినందనీయం.ఈ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, ప్రజలకు నా ప్రత్యేక కృతజ్ఞతలు అని డా. శబరీష్ తెలిపారు.

**గంజాయి పట్టిస్తే రూ.5 వేల నజరానా:**


జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎస్పీ వెల్లడించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా సరఫరా జరుగుతున్నట్లు తెలిస్తే 8712656999 నంబర్‌కు పక్కా సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడమే కాకుండా, వారికి రూ.5వేల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు.

**ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు: ఎస్పీ హెచ్చరిక**

వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. సీట్ బెల్ట్ ధరించకుండా ప్రయాణించడం, వాహన నంబర్ ప్లేట్లలో మార్పులు చేయడం నేరం. రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ట్రాక్టర్ల వెనుక భాగంలో ఎరుపు రంగు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలను ఎల్లప్పుడూ సక్రమంగా ఉంచుకోవాలి. ఈ గ్రామసభలో రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, గూడూరు సీఐ విజయ్, ఎస్సై గిరిధర్, ఎంఆర్‌ఓ నాగభవాని, స్థానిక సర్పంచ్ సునీత, వార్డు సభ్యులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ్' లేదు

- ప్రజలను గౌరవిస్తాం..రౌడీలు, గుండాలను కాదు: డీజీపీ సీవీ ఆనంద్
- గ్రేహౌండ్స్‌లో భారీ మార్పులు..1,700 మంది సిబ్బంది బదిలీ
- గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్10:** తెలంగాణలో ఇకపై ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డిజిపి) సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శాంతిభద్రతల పరిరక్షణ,పోలీసు వ్యవస్థ ఆధునీకరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టాన్ని గౌరవించే సామాన్య ప్రజలకు పూర్తిస్థాయిలో గౌరవం ఇస్తూనే,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీలు,గుండాలు, చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా (నో ఫ్రెండ్లీ పోలీసింగ్) వ్యవహరిస్తామని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోయాయని ప్రస్తుతం తెలంగాణలో మావోయిజం అంతరించిపోయిన పరిస్థితి నెలకొందని డీజీపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. **గ్రేహౌండ్స్‌లో విప్లవాత్మక మార్పులు:** మారుతున్న కాలం శాంతిభద్రతల అవసరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు.ఇందులో భాగంగానే ప్రతిష్టాత్మక 'గ్రేహౌండ్స్'విభాగంలో భారీ మార్పులు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ విభాగంలోని సుమారు 1,700 మంది సిబ్బందిని ఇతర కొత్త విభాగాలు, అవసరమైన అనుబంధ శాఖలకు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. **ఆ రెంటిపై ప్రత్యేక నిఘా:** రాష్ట్రంలో యువతను పట్టిపీడిస్తున్న గంజాయి, మాదకద్రవ్యాల (డ్రగ్స్) అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతోందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.యువత డ్రగ్స్ బారిన పడకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, సరఫరాదారులపై కఠిన నిఘా ఉంచినట్లు చెప్పారు. **సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త:** ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పోలీసు శాఖకు అతిపెద్ద సవాల్‌గా మారాయని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక సాంకేతిక బృందాలు (టెక్నికల్ టీమ్స్) రంగంలోకి దిగాయన్నారు. ప్రజలు కూడా అపరిచిత లింకులు, నకిలీ ఫోన్ కాల్స్, ఓటీపీ వివరాల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ అభినందించారు. రాష్ట్రంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని,ప్రజల రక్షణే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

